క్లుప్తంగా

గ్యాస్ కేవైసీకి పోటెత్తిన మహిళలు



గ్యాస్ కేవైసీ అప్‌డేట్‌కు కార్యాలయం ఎదుట బారులు తీరిన మహిళలు

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వంట గ్యాస్ కనెక్షన్ కలిగిన ఉన్న ప్రతి మహిళ కేవైసీ అప్‌డేట్ చేయించుకునేందుకు పట్టణంలోని వంట గ్యాస్ కేంద్రం వద్ద పోటెత్తారు. అప్‌డేట్‌కు శనివారం ఆఖరి రోజు అని ప్రచారం జరగడంతో ఒక్కసారిగా పలు మండలాలకు చెందిన మహిళలు గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీస్ ఎదుట బారులు తీరారు. గ్యాస్ కనెక్షన్ కలిగిన ఉన్న తప్పనిసరిగా తమ వేలి ముద్రతో కేవైసీ చేయించుకోవాల్సి ఉండడంతో ఆధార్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ కార్డులతో కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఈ విషయమై డిస్ట్రిబ్యూషన్ వారిని సంప్రదించగా వాస్తవానికి మార్చి నెల 30వ తేదీ చివరి రోజు అని, కేవైసీ చేయించాల్సిన వినియోగదారులు ఇంకా ఉండడంతో కొన్ని రోజులు పొడిగించవచ్చునన్నారు.

ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరం మండలం గౌరవరంలో అంకాలమ్మ తల్లి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితులు శిఖర ప్రతిష్ట అనంతరం అమ్మవారి విగ్రహానికి శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ట చేశారు. గ్రామస్తులు అమ్మ వారికి పొంగళ్లు పెట్టారు. ఈ కార్యక్రమం గ్రామానికి చెందిన సురేష్–నవీన, పెనుమాది జగదీశ్–కవిత, శాఖమూరి సుబ్బారావు–కామాక్షమ్మ దంపతుల ఆధ్వర్యంలో జరిగింది.

ఎన్నికల నియమావళిపై అవగాహన



సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ

సోమశిల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తాజ్ మస్రూర్ అధ్యక్షతన శనివారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై తగిన సూచనలు అందజేశారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి సిబ్బంది ఎవరూ ఎటువంటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన కూడదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అనుసరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ



వెంకట రమణయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విక్రమ్‌రెడ్డి

చేజర్ల: చేజర్లకు చెందిన ఆత్మకూరు వెంకట రమణయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను శనివారం రాత్రి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. రమణయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మర్యాద పూర్వకంగా



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మండల నాయకులు, వార్డు సభ్యురాలు నాగశిల్ప

సంగం: సంగం బిట్–2 వార్డు సభ్యురాలు నెల్లూరు నాగశిల్ప నెల్లూరులోని మేకపాటి నివాసంలో సంగం మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సమష్టి కృషితో మండలంలో గతంలో కంటే అధికంగా మెజార్టీ వచ్చే విధంగా అందరం పని చేద్దామని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పండిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, రావుల ప్రసాద్‌గౌడ్, సర్పంచ్ మానికల చందు పాల్గొన్నారు.

కావలి అభివృద్ధిని అడ్డుకున్న ద్రోహి

- నువ్వేం చేశావని జనం వస్తారు.. బాబు
- రామాయపట్నంపోర్టు, ఫిషింగ్ హార్బర్, ఎయిర్‌పోర్టులను విస్మరించావే
- పెద్దపవని రోడ్డులో రైల్వే ఫ్లై ఓవర్ పనులకు అడ్డుపడింది మీరే కదా
- తుమ్మలపెంట రోడ్డు పునర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : రాష్ట్రానికి 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు కావలిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగళం అట్టర్ ఫ్లాప్ కావడానికి, ఆయన పాలనా పాపమే కారణమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. 'చంద్రబాబు నువ్వు కావలికి ఏం చేశావని నీ సభలకు జనం వస్తారు' అని ప్రశ్నించారు. ప్రజాగళం సభకు ప్రజలు లేక గంటన్నర పాటు హెలికాప్టర్ దిగిన చోటనే బస్సులో ఉండిపోవాల్సి వచ్చిందంటే నీ పరిపాలన ఎలాంటిదో ప్రజలకు అర్థమైందన్నారు. శనివారం తన నివాసంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో 9 ఏళ్ల అధికారంలో ఉండి కావలి నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. విభజన రాష్ట్రంలో ఐదేళ్ల అధికారంలో ఉండి దశాబ్దాలుగా ప్రతిపాదనలో ఉన్న రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, దగదర్తి ఎయిర్‌పోర్టును విస్మరించారన్నారు. ఎన్నికలకు నెల ముందు నిధులు, విధానాలు లేకుండా శంకుస్థాపన చేసి నియోజకవర్గ ప్రజలను చంద్రబాబు మోసం చేశారన్నారు. దగదర్తి ఎయిర్‌పోర్టు పేరుతో టీడీపీ నేతలు భూకుంభకోణాలకు పాల్పడింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కావలి పట్టణంలో పెద్దపవని రోడ్డులో ఫ్లైఓవర్ రైల్వే బ్రిడ్జి వల్ల స్థానిక వ్యాపారులు నష్టపోయి ఉపాధి అవకాశాలు కోల్పోతారని, రైల్వే ట్రాక్ కు అండర్ పాస్ నిర్మిస్తే సరిపోతుందని స్థానికులు ఆందోళనలు చేసినా చంద్రబాబు పట్టించుకోలేదని గుర్తు చేశారు. అయినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించి కాంట్రాక్టర్‌ను చేయనీయకుండా టీడీపీ నేతలే అడ్డుపడ్డారన్నారు. తీర ప్రాంతానికి ప్రధానమైన తుమ్మలపెంట రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్‌తో పనులు చేయనీయకుండా అడ్డుపడింది టీడీపీ నాయకులు కాదా అని మండిపడ్డారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి చంద్రబాబు ద్రోహి అని విమర్శించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానంగా రామాయపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్‌కు నిధులు కేటాయించి శరవేగంగా పూర్తి చేయించారని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు భారీగా విలువ పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలతో పాటు అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తున్నామన్నారు. కావలి పట్టణంలో పెద్దపవని రోడ్డులో ఫ్లైఓవర్ రైల్వే బ్రిడ్జి, తుమ్మలపెంట రోడ్డు నిర్మాణాలు చేయడానికి కాంట్రాక్టర్ల సమస్యను పరిష్కరించామని తెలిపారు. దందాలు, దోపిడీలు, అక్రమ వసూళ్లు, కమీషన్లు గుంజడం, మామూళ్ల దండకాలు తదితర వ్యవహారాల్లో నిష్ణాతులైన టీడీపీ నాయకులు వలె తాము కూడా చేస్తుంటామనే భ్రమలో చంద్రబాబు కావలికి వచ్చి వాడెవడో రాసిచ్చిన కాగితాన్ని చదవడం చంద్రబాబు మానసిక స్థితిని తెలియజేస్తుందన్నారు. కావలి ప్రజలు టీడీపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. కావలి టీడీపీ అభ్యర్థి పెద్ద కబ్జాదారుడని, అందుకు అవసరమైన అన్ని సాక్ష్యాలు ఉన్నాయన్నారు. దానిని చంద్రబాబు కవర్ చేసేందుకే తనపై నిందలు మోపుతున్నారన్నారు. ఒక్క వైఎస్ జగన్‌ను ఎదుర్కొవడానికి చంద్రబాబు పలు పార్టీలతో జతకట్టి జట్టుగా వస్తున్నాడన్నారు.

ఏప్రిల్ 6న కావలిలో జనప్రభంజనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ఏప్రిల్ 6న కావలికి రానుందని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కావలి నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా తరలిరాబోతున్నారన్నారు. ఆ రోజు కావలిలో జన ప్రభంజనాన్ని చూస్తారని ధీమా వ్యక్తం చేశారు. కావలిలో ఈ ఐదేళ్లలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పు.. జన ప్రభంజనంగా తరలివస్తారని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ,గంధం ప్రసన్నాంజనేయులు, పందటి కామరాజు, కుందుర్తి కామయ్య, దాసరి శివాజీ, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి,కాటా శ్రీనివాసులురెడ్డి, వేగూరు చిన్న పుల్లయ్య, పొనుగోటి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల అభ్యున్నతి



గొల్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

- సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: పేద వర్గాల అభ్యున్నతితో పాటు రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం మండలంలోని గొల్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి స్థానికులతో మమేకమై ప్రచారం నిర్వహిస్తూ సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ రానున్న రోజుల్లో గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధిని వివరించారు. 20 ఏళ్లుగా అసైన్‌మెంట్ భూమి కలిగిన వారికి శాశ్వత హక్కు కల్పిస్తూ చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో ఇంతటి అభివృద్ధిని చూడలేదని, ఒక్క గొల్లపల్లి గ్రామాభివృద్ధికి రూ.5.39 కోట్లు అందజేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ. 12.5 లక్షలను అభివృద్ధి పనులకు కోసం అందజేశారన్నారు. చుక్కల భూములు, అసైన్‌మెంట్ ఫ్రీ హోల్డ్ కింద 58 మంది రైతుల సమస్యలు పరిష్కరించామన్నారు. అరుంధతీయవాడ, ఎస్టీ కాలనీ వాసుల కోరిక మేరకు శ్మశాన నిర్మాణంతో పాటు పడమటి కాలనీలో ఆలయం ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. గొల్లపల్లిలో మిగిలిన గ్రావెల్ రోడ్లు, సిమెంట్ రోడ్లు పూర్తి చేస్తామన్నారు. ప్రతి పది పంచాయతీలకు ఒక కల్యాణ మండపాన్ని నిర్మిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నామని తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, జేసీఎస్ కన్వీనర్ పి బాలగంగాధర్‌రెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ జి వెంకటసుబ్బయ్య, గొల్లపల్లి సర్పంచ్ వెండిపల్లి జయంతి, నాయకులు బి సుధాకర్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, ఉడతా చిన హజరత్తయ్య, బి.రామచంద్రయ్య, వావిలేరు సర్పంచ్ రాంబాబు, బోడిపాడు మాజీ సర్పంచ్ మాల కొండారెడ్డి, మడపల్లి ఉప సర్పంచ్ మాలకొండారెడ్డి, బీసీ నేత మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతలు ఏం చేశారో చెప్పి ఓట్లడగండి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మర్రిపాడు: రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూటమిగా ఏర్పడి వస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు 2014లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్నింటిని అమలు చేశారో వివరించి మళ్లీ ఓట్లు అడిగేందుకు రావాలని నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని చాబోలు, కంపసముద్రం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి రచ్చబండ నిర్వహించారు. ప్రజలతో ముఖాముఖి ముచ్చటించిన మాజీ ఎంపీ మేకపాటి ఐదేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రజలందరి కోసం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేశారని, మెట్ట ప్రాంత వాసుల లబ్ధి కోసం తాము కోరిన వెంటనే హైలెవల్ కెనాల్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం ఆయన ప్రారంభిస్తే కుమారుడు జగన్ మోహన్‌రెడ్డి పూర్తి చేసి సాగు, తాగునీటిని అందించారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇప్పటికి ప్రజలందరికి గుర్తున్నాయన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరిన్ని సంక్షేమ పథకాలను అందించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు.

ఒక్క హామీ అయినా అమలు చేశావా.. బాబు

40 ఏళ్ల రాజకీయం చేసి 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన ఒక్క సంక్షేమ పథకం ఉందాని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన హామీలు, రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇలా చెప్పుకుంటూ పోతే మన రాష్ట్రానికి జరగాల్సిన సంక్షేమాన్ని అందజేయకపోవడంతో 2019లో ప్రజలే బుద్ధి చెప్పారన్నారు. మళ్లీ 2024 ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నారని, ప్రజలెవరూ వారిని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఆత్మకూరు నుంచి పోటీ చేయనున్న ఆనం రామనారాయణరెడ్డిని మంత్రిని చేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణిస్తే ఆయన కుటుంబంపై, జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారన్నారు. అయినా 2019లో మళ్లీ ఆయన పంచనే చేరి ఎమ్మెల్యే అయ్యారన్నారు. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో మళ్లీ టీడీపీ తరపున పోటీ చేస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శిస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తిని ప్రజలు విశ్వసించరన్నారు. నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డి జగన్‌కు అత్యంత సన్నిహితుడని ఆయన్ను గెలిపించుకుంటే నెల్లూరు అభివృద్ధిలోకి వస్తుందన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, హజరత్‌రెడ్డి, చెన్ను శ్రీధర్ రెడ్డి, కాంతారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



మసీదులో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే

చేజర్ల: స్థానిక జామియా మసీదులో ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నేతలతో కలిసి దువా నిర్వహించారు. అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు.

డిప్లామా కోర్సుల ప్రవేశ పరీక్షకు శిక్షణ

ఆత్మకూరు: పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే పాలిసెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 27వ తేదీ నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 1వ తేదీ నుంచి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

ఉదయగిరి: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నియమించిన ఎన్నికల సిబ్బంది నిష్పక్ష పాతంగా విధులు నిర్వహించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల్లో జరిగిన పీఓ, ఏపీఓల ముగింపు శిక్షణా తరగతుల కార్యక్రమంలో మాట్లాడారు. సిబ్బందికి అందించిన హ్యాండ్ బుక్‌లోని అంశాలు, నియమ నిబంధనలపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి సిబ్బంది పని చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెహ్రూబాబు మాస్టర్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

మర్రిపాడు: వేగంగా వెళ్తున్న ఓ కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈఘటన మండలంలోని డీసీపల్లి టోల్ ప్లాజా సమీపంలో పెట్రోల్ బంకు సమీపంలో శనివారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు మరోక వ్యక్తి సురక్షితంగా బయట పడ్డారు. హైవే మొబైల్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని కారును స్థానికుల సహాయంతో పక్కకు తొలగించారు.

దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపు

- వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు
- 'దళిత వ్యతిరేకి చంద్రబాబు' అంటూ ఫ్లకార్డులతో నిరసన



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ దళిత విభాగం నేతలు

కావలి: దళితులంటే చంద్రబాబుకు మొదటి నుంచి కూడా చిన్న చూపని, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారంటూ తన కుల అహంకార జాడ్యాన్ని ప్రదర్శించారని కావలికి చెందిన దళిత నాయకులు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, కావలి పట్టణ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పరుసు మాల్యాద్రి విమర్శ. పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు 'దళిత వ్యతిరేకి చంద్రబాబు' అంటూ ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ దళిత నాయకులు మాట్లాడుతూ విద్యావంతుడికి ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఇస్తే అతను టిప్పర్ డ్రైవర్ అంటూ చంద్రబాబు హేళనగా మాట్లాడడం దుర్మార్గమ్మన్నారు. సామాన్యులైన డ్రైవర్లపై చంద్రబాబు చిన్న చూపు ప్రదర్శించడం ఆయన కావరానికి నిదర్శనమన్నారు. టిప్పర్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు దేనికీ పనికిరారనట్టుగా చంద్రబాబు మాట్లాడుతున్నాడన్నారు. విద్యావంతుడైన ఒక దళిత నాయకుడ్ని, ఎమ్మెల్యే అభ్యర్థిని ఎడమ చేత్తో వేలిముద్ర వేసేవాళ్లంటూ చంద్రబాబు ఎగతాళి చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ నాయబ్ రసూల్, బీసీ నాయకులు గుడ్లూరు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి ఎన్‌డీఏ ప్రభుత్వమే

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆత్మకూరు: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని జేఆర్‌పేటలో నియోజకవర్గ బీజేపీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి జనరంజక పాలన అందించారన్నారు. ఎన్‌డీఏకి 400కుపైగా ఎంపీ స్థానాలు ప్రజల సహకారంతో దక్కనున్నాయన్నారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కాలం బుజ్జిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంది మల్లికార్జునరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, కె రాజ్యలక్ష్మి, బుజ్జమ్మ, బీజేపీవైఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ప్రోత్సాహంతోనే సేవా కార్యక్రమాలు



ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో అన్నదాన హాలులో అన్నపూర్ణాదేవికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

- సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ తొలి వార్షికోత్సవం

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు, వారి బంధువులకు ఏడాది కాలంగా నిత్యాన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేసే అవకాశం దక్కడం అదృష్టమని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం ట్రస్ట్ కార్యాలయంలో తొలి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అన్నదానం నిర్వహించే హాలులో కాశీ అన్నపూర్ణేశ్వరి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రారంభించిన తొలి రోజుల్లో రోజుకు 350 మందికి అన్నదానం చేస్తుండగా, క్రమేపి రోజు (ఆదివారం మినహా) 750 నుంచి 800 మందికి అన్న ప్రసాదాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు మున్సిపల్ పరిధిలో పేదలు ఎవరైనా మృతి చెందితే ఆ కుటుంబాలకు ఉత్తరక్రియలకు ఆర్థిక సాయం అందజేయడం, కైలాసరథం, రెండు ఫ్రీజర్లు ఏర్పాటు, తదితర సేవలు తమ ట్రస్ట్ తరుపున చేస్తున్నట్లు తెలిపారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పరమేశ్వరరెడ్డిని పలువురు అభినందించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కేవీ శేషారెడ్డి, యానాదిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నారాయణ రావు, ఎన్.వెంకటేశ్వరరెడ్డి, అపర్ణ, ఇంటూరు నారాయణ, గోవింద రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని గెలిపించుకోవాలి




బ్రోచర్లు అందించి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వరికుంటపాడు: నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు సమర్థ వంతంగా అమలు చేస్తున్న సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను తిరిగి సీఎంగా చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి ఎర్రాఓబయ్య, టీసీపల్లి సర్పంచ్ పి.పెద్దమౌలాలి, ఎంపీటీసీ పీ.లక్ష్మమ్మ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని తోటల చెరువుపల్లె సచివాలయ పరిధిలో 'జగనన్న భరోసా–రాజన్న గ్యారెంటీ' గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో మేకపాటి కుటుంబం ద్వారానే అభివృద్ధి సాధ్యమైందన్నారు. అనంతరం ఇళ్లకు స్టిక్కర్లు అంటించి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందించారు. రానున్న ఎన్నికల్లో ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించాలని, తద్వారా సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అఖండ విజయాన్ని చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.శ్రీను, ఖాజారంతుల్లా, పి.వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, శ్రీధర్, కె.మాలకొండయ్య, వర నారాయణ, ఎస్.హరిబాబు, చిన్నకాశయ్య, పి.ప్రసాద్, షేక్ హబీబ్‌బాషా, సీహెచ్ నాగరాజు, జి.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలి

చేజర్ల: ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ ఎస్కే కరిముల్లా కోరారు. శనివారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ఎటువంటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన కూడదన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల నియమావళి అమలును చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపికృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ, తహసీల్దారు

అనుమసముద్రంపేట: ఎన్నికల నిబంధనలు పాటించాలని తహసీల్దారు రవికుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌పై అవగాహన కలిగి ఉండాలని, అందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.